రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా..

- కేశాపూర్ క్రాస్ రోడ్డు నుంచి బర్దిపూర్‌కు వెళ్లే మార్గంలో అడుగుకో గుంత
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పునరుద్ధరణ కోసం రూ.60 లక్షలు మంజూరు
- ముందుకు రాని కాంట్రాక్టర్లు



గుంతలతో ఉన్న బర్దిపూర్ రోడ్డు

డిచ్‌పల్లి : మండలంలోని బర్దిపూర్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు అడుగడుగునా గుంతలు పడి అధ్వానంగా మారింది. కేశాపూర్ క్రాస్ రోడ్డు నుంచి బర్దిపూర్‌కు వెళ్లే బీటీ రోడ్డు కంకర తేలి, గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఈ గుంతల్లో నీరు నిలిచి నడక కూడా నరకప్రాయంగా మారింది. వాహనదారులైతే ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. రాత్రి పూట రోడ్డుపై గుంతలు కన్పించక ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా బర్దిపూర్ తో పాటు ఆరేపల్లి, కంజర్ గ్రామాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా గ్రామస్తుల వినతి మేరకు రోడ్డు పునరుద్దరణ కోసం ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి 19 ఏప్రిల్ 2025 న రోడ్డు పునరుద్ధరణ కోసం శంకుస్థాపన చేశారు. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోకవడంతో ఆరు నెలలు గడిచినా రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో కంకర తేలి, గుంతలు పడిన రోడ్డు మీదుగానే ప్రజలు అవస్థలు పడుతూ రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీలైనంత త్వరగా రోడ్డు పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.





గుంతల్లో నిలిచిన నీరు



గుంతల రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు

స్వల్ప మరమ్మతులతో చేతులు దులుపుకున్నారు



న్యావనంది చౌరస్తా సమీపంలో కాజ్‌వే పై పోసిన కంకర

- సిరికొండ మండలంలో గుంతలమయంగా రోడ్లు
- ప్రారంభమైన వరికోతలు
- వాహనదారులకు ఇబ్బందులు

సిరికొండ: వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ధ్వంసమైన రోడ్లకు స్వల్ప మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కొండూర్ కప్పలవాగు వద్ద కొట్టుకుపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఆర్టీసీ బస్సులు, లారీలు ఇతర భారీ వాహనాలైతే న్యావనంది చౌరస్తా, చిన్నవాల్గోట్ మీదుగా వెళుతున్నాయి. కార్లు ద్వి చక్ర వాహనదారులు అయితే మోడల్ స్కూల్ మార్గం మీదుగా చిన్నవాల్గోట్ మీదుగా వెళుతున్నారు. ఈ రెండు మార్గాల్లో రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. కేవలం న్యావనంది చౌరస్తా సమీపంలో లోలెవల్ కాజ్‌వేపై ఒక్క చోట, న్యావనంది చౌరస్తాకు- న్యావనంది బైపాస్ రోడ్డుకు మధ్యలో మూలమలుపు వద్ద గుంతలో ఒక చోట కంకర పోసి చదును చేసి ఆర్అండ్‌బీ అధికారులు చేతులు దులుపుకున్నారు. భారీ వర్షాలకు రోడ్లు ధ్వంసమై నెలన్నర గడుస్తున్నా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిరికొండ నుండి భీంగల్ వెళ్లే మార్గంలో సత్యశోధక్ పాఠశాల వరకు నాలుగైదు చోట్ల భారీగా ఏర్పడ్డ గుంతల్లో పాఠశాల యాజమాని ఆర్ నర్సయ్య పది వేల వ్యయంతో కంకర పోయించి సిబ్బందితో చదును చేయించారు. మండల వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం రవాణా చేయడానికి లారీలు గుంతల రోడ్ల పైనుండి వెళ్లలేని దుస్థితి నెలకొంది. మండల కేంద్రం నుంచి కొండాపూర్ వరకు, కొండాపూర్ నుంచి ముషీర్‌నగర్ మీదుగా కార్నర్ తండా వరకు, చిన్నవాల్గోట్, పెద్దవాల్గోట్, మోడల్ స్కూల్ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సుద్దపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిచ్‌పల్లి సొసైటీ వైస్ చైర్మన్ ఆరేపల్లి చిన్న గంగారాం

డిచ్‌పల్లి : మండలంలోని సుద్దపల్లి గ్రామంలో ఆదివారం ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం డిచ్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ ఆరేపల్లి చిన్న గంగారాం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము కష్టపడి పండించిన వరి ధాన్యంను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. పానుగంటి జనార్దన్, పబ్బ రమణ, లోలంగంగారాం, వాల్గోట్ మోహన్, చిన్నయ్య, రాజు, మోహన్,సాయిలు, తిరుపతి, కాసుల సురేష్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకెళ్దాం



మాట్లాడుతున్న యాటకర్ల దేవేశ్

జక్రాన్‌పల్లి : ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం లక్ష్యంగా ముందుకు వెళ్దామని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు యాటకర్ల దేవేశ్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం మండల ముదిరాజ్ సంఘ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు అన్ని రాజకీయ పార్టీలు మొండి చేయి చూపించాయని అన్నారు. ముదిరాజ్‌లు 'మేమెంతో మాకు అంత' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నారని అన్నారు. జక్రాన్‌పల్లిలో ముదిరాజ్‌ల జెండా ఎగరవేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. నాయకులు కొప్పు రాజేందర్, యాటకర్ల గణేష్, ఈర్ల భూమేష్ సోప్పరి వినోద్, గోపి, కిషన్, గంగాధర్, మహేందర్, బొంగు సదానంద్, నరేష్, బోండ్ల అరుణ్, కొప్పు సుదర్శన్ పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యేకు పరామర్శ



నిజామాబాద్ రూరల్: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌లోని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డిని ఆదివారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి, వర్ధన్నపేట్ ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. భూపతిరెడ్డి తల్లి లక్ష్మీ నర్సమ్మ గత నెల 29న మృతిచెందిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఎమ్మెల్యే కుటుంబాన్ని వారు పరామర్శించి, సానుభూతి తెలిపారు. అనంతరం లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, పీసీసీ అధికార ప్రతినిధి వేణుయాదవ్, భాస్కర్‌రెడ్డి, నాయకులు భోజన్న, నరేష్, భాగారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందూరు తిరుమల'లో వరి కోతలు ప్రారంభం



మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో గల ఇందూరు తిరుమల గోవింద వనమాల ప్రాంగణంలో వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం వరి కోతలు ప్రారంభమయ్యాయి. అంతకుముందు మైసమ్మ, అన్నపూర్ణామాతకు పూజలు చేసి ఆలయ ప్రధాన ధర్మకర్త నర్సింహారెడ్డి కోతలను ప్రారంభించారు. పంటలు మంచిగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

14న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

నిజామాబాద్ నాగారం: విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడిన వర్గాల తరగతులకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.9పై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ, ఈనెల 14న తలపెట్టిన రాష్ట్ర బందును జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అఖిలపక్ష రాజకీయ పార్టీలు, బీసీ కులసంఘాలు, ప్రైవేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వాలని కోరారు.

నాందేవ్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలి



నాందేవ్ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, మేర కులస్తులు

సుభాష్‌నగర్ : సంత్ శిరోమణి సద్గురు శ్రీ నాందేవ్ మహరాజ్ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వినాయక్‌నగర్‌లో మహనీయుల విగ్రహాల ప్రాంగణంలో సంత్ శిరోమణి సద్గురు శ్రీ నాందేవ్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నాందేవ్ మహరాజ్ 700 ఏళ్ల క్రితమే మేరు కులస్తుల ఐక్యత కోసం పోరాడిన మహనీయులని కొనియాడారు. ఆయన బోధనలు నేటి తరానికి ఎంతో ప్రేరణనిస్తాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మేరు కులస్తులు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనడంపై ఎమ్మెల్యే ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొల్కం గంగాకిషన్, జిల్లా మేరు సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ నామ్‌దేవ్ రావు, నాయకులు కొట్టూరు దేవదాస్, కొట్టూరు చంద్రకాంత్, మంతెన దశరథ్, ధర్మస్తు గంగాధర్, యెన్ను సుదర్శన్, మేరు సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'వారాహి' ఆలయం సందర్శన



వారాహి మాతకు ప్రత్యేక పూజలు చేసిన కోటేశ్వర్‌రావు, జ్ఞానేందర్

సుభాష్‌నగర్ : నగరంలోని అమ్మవెంచర్‌లోగల నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వారాహి అమ్మవారి ఆలయాన్ని డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ ఇండియా అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి కోటేశ్వర్ రావు సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ కోటేశ్వర్‌రావుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారాహి మాత ఆలయం నిర్మించడమనేది పవిత్రమైన కార్యమని, ఇందూరుకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందన్నారు.ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శక్తి కేంద్రంగా మారుతోందని ఆలయ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ తెలిపారు.

ఐఎఫ్‌టీయూ నగర నూతన కార్యవర్గం



నినాదాలు చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

నిజామాబాద్ సిటీ : ఐఎఫ్‌టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు శివకుమార్ తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎన్ఆర్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నగర అధ్యక్షుడిగా మల్లికార్జున్, నగర ప్రధాన కార్యదర్శిగా శివకుమార్ ఉపాధ్యక్షులుగా మోహన్, రాయిస్, సహాయ కార్యదర్శిగా నర్సింగ్‌రావు, కోశాధికారిగా టి.రాజుతో పాటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. సభలో పలు తీర్మానాలు చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 60 ఏళ్లు దాటిన కార్మికులకు నెలకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వకూడదని డిమాండ్‌చేశారు. వీధి వ్యాపారులకు వ్యాపారం చేసుకోవడానికి స్థలాలు కేటాయించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



వినాయక్‌నగర్‌లో బోనాలతో మహిళలు



కోటగల్లిలో..

నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయక్‌నగర్ పాటిగల్లి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లారు. పోచమ్మ, మహాలక్ష్మీ, పోతలింగయ్య, మత్తడి పోచమ్మతోపాటు వివిధ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. సంఘం సభ్యులు మాజీ కార్పొరేటర్ ఆకుల హేమలత, కుల సంఘం అధ్యక్షుడు సూదం శ్రీనివాస్, మెట్టు దర్శన్, మహిళలు పాల్గొన్నారు. అలాగే కోటగల్లి మాల సంఘం ఆధ్వర్యంలోనూ బోనాల పండుగ నిర్వహించారు. కోటగల్లి మాల సంఘం ముఖ్య సలహాదారులు సుంకరి లక్ష్మీనారాయణ, చెక్క సాగర్, సాదు నారాయణ, సక్కి చంద్రశేఖర్, బేగరీ రాములు, నల్ల రాజారావు, నల్ల ప్రసాద్, ఆసాది రాజలింగం, సుంకరి అబ్బయ్య, తాటి పోచయ్య, పుట్ట బాలయ్య పాల్గొన్నారు. ఆశోక్‌వీధి శివాజీనగర్ ఆధ్వర్యంలో బోనాల పండుగను జరుపుకున్నారు. అధ్యక్షుడు సిద్ధయ్య, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి అనిల్, ఎగొండస్వామి, సాయిలు పాల్గొన్నారు.



నగరంలోని శివాజీ నగర్‌లో..

క్లుప్తంగా

బీడీ పరిశ్రమపై జీఎస్టీ ఎత్తివేయాలి



నిజామాబాద్ సిటీ: బీడీ పరిశ్రమపై కేంద్రం విధించిన జీఎస్టీని ఎత్తివేయాలని బహుజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో బీఎల్‌టీయూ రెండో రాష్ట్ర మహాసభ ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిరాములు మాట్లాడుతూ.. బీడీ కార్మికుల సమస్యలను కేంద్రం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్మికులకు జీవనభృతి ప్రకటించాలన్నారు. అనిల్ కుమార్, దండి వెంకట్, ఆంజనేయులు, సబ్బని లత, ఎల్లయ్య,పోశవ్వ, బి.అరుణ, బి.జగదీష్, ఎస్.డి.సయ్యద్, లక్ష్మి, భారతి, గంగామణి, గంగాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలకు దోమపోటు..



నిజామాబాద్ రూరల్: మండలంలోని సన్న రకాల వరికి దోమ పోటు వెంటాడుతుంది. మరికొన్ని రోజులు పంట కోతలు ప్రారంభం కానుండగా, ఈ దశలో దోమపోటు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రూరల్ మండలంలో 13,220 ఎకరాల్లో వరి సాగవుతుంది. ఎక్కువ శాతం రైతులు సన్నరకాలకు ప్రాముఖ్యతను ఇచ్చారు. కానీ పంటకు దోమ, కోలికి, కంకి, పండుఆకు, తాలు పోవడం, తెగుళ్ల వస్తుండటంతో పంటలను కాపాడుకోవడానికి రైతులు అనేక రకాలైన మందులను పిచికారి చేస్తున్నారు. కాగా, రూరల్ మండలంలో పంటలు కోయకముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రారంభించారు.

16న సీఐటీయూ జిల్లా మహాసభలు



నవీపేట: ఈనెల 16న సీఐటీయూ 5వ జిల్లా మహాసభలను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ ప్రత్యేక కృషి చేసిందన్నారు.కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, క్రిస్టఫర్, సాయమ్మ, దేవకి తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన రాతి కట్టడం వెలికితీసేందుకు ..

రుద్రూర్ : మండల కేంద్రంలో కాకతీయుల కాలంలో రాజరాజేశ్వర మందిరం పూర్తిగా రాతి కట్టడంతో నిర్మించారు. కాలక్రమేణ పండుగల వేళ ఆలయ కమిటీ సభ్యులు సున్నం, పెయింటింగ్ వేయడంతో పురాతన వైభవం కనుమరుగైంది. ప్రాచీన కళను ఆలయానికి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రస్తుత ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్‌రాజ్ ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం చుట్టారు. రాతి కట్టడంపై ఉన్న సున్నం తొలగిస్తున్నారు. ఇద్దరు కాంట్రాక్టర్లు మారారు. తొలుత వారం రోజుల్లో రాతి కట్టడం బయటకు తీస్తామని వచ్చిన కాంట్రాక్టర్ రెండు రోజులకు చేతులెత్తేశాడు. మరో కాంట్రాక్టర్ పనులు చేపట్టినప్పటికీ గతేడాది కాలంగా కొనసాగుతున్నాయి. వారం రోజుల్లో పనులు పూర్తవుతాయని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,28,200	వెండి(కిలో)	1,78,000
22 క్యారెట్స్	1,18,112		- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సిడ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	32	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	80
బీరకాయ	50	100	దోసకాయ	30	60
దొండకాయ	50	100	ఆలుగడ్డ	30	60
బీర్నీసుకాయ	100	180	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	100
వంకాయ	40	80	బీట్‌రూట్	40	80
పాలకూర	80	160	కరివేపాకు	40	80
మెంతికూర	100	180	చామగడ్డ	30	60
కొత్తిమీర	80	160	చిక్కుడుకాయ	30	60
పుదీనా	50	100	గోరుచిక్కుడు	50	100
క్యాప్సికం	50	100			

-సుభాష్‌నగర్

కల్వర్టులకు మరమ్మతులెప్పుడో?



సర్పల్లితండా సమీపంలో ధ్వంసమైన కల్వర్టు



పెద్ద వాల్గోట్‌లో..



చిన్న వాల్గోట్‌లో

సిరికొండ: మండలంలోని వివిధ గ్రామాల మార్గమధ్యలో ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరి గుంతలు ఏర్పడటంతో ప్రమాదరకంగా మారాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా సమస్యను పరిష్కరించడంపై అధికారులెవరూ దృష్టిసారించడం లేదు. మండల కేంద్రం నుంచి చిన్నవాల్గోట్, పెద్దవాల్గోట్, సర్పల్లి తండా మీదుగా జిల్లా కేంద్రం వైపు వెళ్లే మార్గంలో చాలా చోట్ల కల్వర్టులు ధ్వంసమయ్యాయి. కామారెడ్డి వెళ్లే మార్గంలో కొండాపూర్ అటవీ ప్రాంతంలో కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. ఈ ఏడాది వర్షాలు భారీ ఎత్తున కురవడంతో వరద నీరు కల్వర్టుల పైనుంచి ప్రవహించడంతో పలుచోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. కల్వర్టులపై ఏర్పడిన గుంతలను రాత్రివేళల్లో ప్రయాణికులు గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.